# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఖాదీ అనగానే స్వదేశీ ఉద్యమమే గుర్తుకొస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు.
- భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య ఈరోజు ప్రారంభమైన మొదటి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లో వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది.
- వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ఈ రాత్రికి తీరం దాటుతుందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=======================

ఖాదీ అనగానే స్వదేశీ ఉద్యమమే గుర్తుకొస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా విజయవాడలోని ఎస్.ఎస్. కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఖాదీ సంత కార్యక్రమానికి ముఖ్యమంత్రి కొద్ది సేపటి క్రితం హాజరయ్యారు. ముందుగా వేదిక వద్ద జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి ముఖ్యమంత్రి నివాళులు అర్పించారు. అనంతరం ఖాదీ సంత ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించారు. ఆ తరువాత సభా వేదికపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, ఈదురుగాలులు, వరద ముప్పుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమ విధానంలో మాట్లాడారు. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితిని అడిగి

తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందన్న వాతావరణ శాఖ సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను ఎప్పటికప్పుడు అలెర్ట్ చేయాలని నిర్దేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలు సేవలు అందిస్తూ.. అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు బృందాలు సిద్ధంగా ఉండాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు.

======================

స్వచ్ఛాంధ్ర-2025 అవార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 6వ తేదీన విజయవాడలో ప్రదానం చేయనున్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మొత్తం 21 కేటగిరీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులను ప్రకటించింది. రాష్ట్ర స్థాయిలో 69 అవార్డులు, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులను బహుకరించనున్నారు. రాష్ట్ర స్థాయిలో 6 మున్సిపాలిటీలు, 6 గ్రామ పంచాయతీలతో పాటు స్వచ్ఛ జిల్లాగా అనంతపురం ఎంపికయ్యింది.

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని ఈశాన్య ప్రాంతాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చి అభివృద్ధికి కీలక చోదక శక్తిగా మార్చిన ప్రయాణంపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 110 సెకన్లు)

======================

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఈరోజు గంటకు 18 కిలో మీటర్ల వేగంతో ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఈ రాత్రికి ఉత్తర-వాయువ్య దిశగా కదులుతూ ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లను అనుకుని ఉన్న తీరాన్ని గోపాల్‌పూర్, పారాదీప్ మధ్య దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి ఎస్. కరుణాసాగర్ వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

======================

బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చరవాణీలో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ అధికారులు అందరూ అందుబాటులో ఉండేలా, విపత్కర పరిస్థితుల్లో తక్షణ తోడ్పాటు అందించే విధంగా ఏర్పాట్లు చెయ్యాలని ఆదేశించారు.

======================

భారత్, వెస్టిండీస్ పురుష జట్ల మధ్య రెండు మ్యాచ్ ల టెస్ట్ క్రికెట్ సిరీస్ ఈరోజు ప్రారంభమయ్యింది. భారత్ ఆతిధ్యమిస్తున్న ఈ సిరీస్ లో భాగంగా ఉదయం అహ్మదాబాద్ వేదికగా ప్రారంభమైన తొలి మ్యాచ్ లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్

అత్యధికంగా 4 వికెట్లు తీసి అద్భుతంగా రాణించాడు. అనంతరం ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్  తొలిరోజు ఆటముగిసే సమయానికి 2 వికెట్లు నష్టపోయి 121 పరుగులు చేయడంతో ఇంకా 41 పరుగులు మాత్రమే వెనుకంజలో ఉంది.

=======================

పొడి చెత్తను తీసుకొచ్చి స్వచ్ఛరథాల వద్ద అందించినట్లయితే దానికి సమానమైన నిత్యావసర సరుకులు అందిస్తామని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నం నగరంలోని కోనేరు సెంటర్ లో మంత్రి ఈరోజు జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీతో కలిసి స్వచ్ఛరథం వాహనాలను ప్రారంభించారు.

=======================

=======================